
సాక్షి
ఒడిశా
మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.8,83,986లు, బంగారం 4 గ్రాముల 150 మిల్లీగ్రాములు, వెండి 18 గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కుర్రకారు వీరంగం

భువనేశ్వర్‌లో కొందరు కుర్రాళ్లు వీరంగం వేశారు. తప్పతాగి కారు నడిపారు.

- 8లో▸



కానుకల సమర్పణ

బుడి ఠకురాణికి భక్తులు కానుకలు సమర్పించారు. అమ్మవారిని ఊరేగించారు.

- 8లో▸

న్యూస్‌రీల్

నెర్గుండి రైలు మార్గం యథాతథం



నెర్గుండి రైలు మార్గం పునరుద్ధరణ

భువనేశ్వర్: బెంగళూరు–గౌహతి ఏసీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఆదివారం ఉదయం కటక్–భద్రక్ రైల్వే సెక్షన్‌లోని కేంద్రాపడా రోడ్, నెర్గుండి స్టేషన్ల మధ్య పట్టాలు తప్పడంతో రైలు సేవలు తాత్కాలికంగా స్తంభించి పోయాయి. కటక్ – నెర్గుండి రైలు మార్గంలో పట్టాల వ్యవస్థ పూర్తిగా దెబ్బ తింది. సోమవారం ఉదయం 7.15 గంటలకు పునరుద్ధరణ కార్యకలాపాలు పూర్తిగా ముగించి రైళ్ల రవాణాకు అనుమతించారు. ఆ తర్వాత విద్యుత్ రైళ్ల నిర్వహణ వ్యవస్థ ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్ (ఓహెచ్‌ఈ) పునరుద్ధరించారు. ప్రభావిత డౌన్ లైన్‌లో తొలి రైలు సోమవారం ఉదయం 9.30 గంటలకు నడిచింది. కాసేపటి తర్వాత అప్–లైన్‌లో రైలు సేవల్ని యథాతథంగా పునరుద్ధరించారు. బెంగళూరు – గౌహతి ఏసీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన కారణంగా ఈ మార్గంలో రైళ్ల కదలికలను తాత్కాలికంగా సర్దుబాటు చేసి నడిపించారు. ఈ నేపథ్యంలో తూర్పు కోస్తా రైల్వే 38 డౌన్ లైన్ రైళ్లను, 17 అప్ లైన్ రైళ్లను ప్రత్యామ్నాయ మార్గాల గుండా మళ్లించింది.

పోలీసుల నిఘా



బాలాసోర్‌లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

భువనేశ్వర్: బాలాసోర్ ప్రాంతంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. త్వరలో ఆరంభం కానున్న శ్రీ రామ నవమి పూజల సన్నాహాల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా పోలీసులు సమస్యాత్మక ప్రాంతాల్లో పహరా ముమ్మరం చేశారు. ఈ జిల్లా సొరొ మునిసిపాలిటీ ప్రాంతంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

పోలీసులపై దాడి

- ఇద్దరికి గాయాలు



గాయపడిన పోలీసు సిబ్బంది

భువనేశ్వర్: స్థానిక భరత్‌పూర్ బొనొ దుర్గా బస్తీ ప్రాంతంలో అల్లర్లను అణిచివేసే ప్రయత్నంలో పోలీసులు గాయపడ్డారు. విధి నిర్వహణలో భాగంగా స్థానికులతో వీరికి ఘర్షణ జరిగింది. ప్రధాన నిందితుడిని అదుపులోకి తీసుకుని వెళ్తుండగా పోలీసులపై స్థానికులు అకస్మాతుగా తిరుగుబాటు చేశారు. నిందితుని తరలిస్తుండగా పోలీసు వాహనంపై రాళ్లు రువ్వారు. ఈ సంఘటనలో ఒక మహిళా ఏఎస్ఐ, డ్రైవర్ గాయపడ్డారు. దాడితో సంబంధం ఉన్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు.

పర్యాటకుల ముసుగులో గంజాయి రవాణా



కొరాపుట్ జీఆర్ పోలీసులు పట్టుకున్న గంజాయి స్మగ్లర్లు



స్వాధీనం చేసుకున్న గంజాయి

కొరాపుట్: కొరాపుట్ జిల్లాలో గంజాయి అక్రమ రవాణా కొత్త పుంతలు తొక్కుతోంది. సోమవారం వేకువ జామున కొరాపుట్ రైల్వే స్టేషన్‌లో కోల్‌కతాకు వెళ్లే సమలేశ్వరి రైలు కోసం ఖరీదైన వస్త్రాలు ధరించిన మస్కానా అనే ఒక మహిళ, మరో బాలిక వేచి చూస్తున్నారు. వీరిని చూసిన జీఆర్పీ పోలీసులు ఆరా తీశారు. తాము ఉత్తర ప్రదేశ్ నుంచి వచ్చామని చెప్పగానే పోలీసులు అప్రమత్తమయారు. ఇక్కడ కొరాపుట్‌కి పర్యాటకులుగా వచ్చామని చెప్పగా.. వారి వస్తువులు సోదా చేశారు. దీంతో 20 కిలోల గంజాయి పట్టుబడింది. వేరే ప్లాట్‌ఫారం మీద విశాఖపట్నం వెళ్లే రైలు వద్ద ఉత్తర్ ప్రదేశ్‌కి చెందిన అంకుర్ కుమార్ అనే మరో యువకుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అతని వద్ద మరో 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి మాఫియా సాధారణ ప్రజలను తమ ఖర్చులతో కొరాపుట్‌కి పర్యాటకులుగా పంపుతోంది. తిరిగి వెళ్లేటప్పుడు వారి ద్వారా గంజాయి తెప్పించుకుంటున్నట్లు పోలీసులు ప్రకటించారు. ముగ్గురు నిందితులను జైలుకి తరలించారు.

ఘనంగా అంతర్జాతీయ ..

కిన్నెర దినోత్సవం



నబరంగ్‌పూర్ బండారు ఘరణి మందిరం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న కిన్నెరలు



అంతర్జాతీయ ట్రాన్స్‌జెండర్స్ దినోత్సవం సందర్భంగా వర్క్‌షాపును ప్రారంభిస్తున్న మధుబోరాదో

కొరాపుట్:

అంతర్జాతీయ కిన్నెర దినోత్సవాన్ని నబరంగుపూర్, కొరాపుట్ జిల్లాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని శక్తి పీఠం నుంచి కిన్నెరలు పూర్ణ కుంభంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ బస్టాండ్ సమీపంలోని వినాయక్ భవన్ వరకు సాగింది. అక్కడ జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో మాట్లాడుతూ కిన్నెరలు సామాజిక, ఆర్థిక, ఉపాధి రంగాలలో స్వయం శక్తి సాధించడానికి ప్రభుత్వం తోడ్పాటు ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా వారికి కుట్టు మిషన్లు, వంట పాత్రలు, గ్యాస్ సిలిండర్లు, కుర్చీలు, టేబుళ్లను కలెక్టర్ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కిన్నెర సంఘం అధ్యక్షుడు మనోజ్ పట్నాయక్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సుధాంశు పాత్రో, డీబీఆర్‌ఓ మనోజ్ బెహరా, కౌన్సిలర్ షర్మిష్టా దేవ్, ఎ.ధనుంజయ్ రావు, కిన్నెర సంఘం తరఫున కాజల్ కిన్నెర, చుమ్కి కిన్నెర, ప్రీతి కిన్నెర తదితరులు పాల్గొన్నారు. మరో వైపు కొరాపుట్ జిల్లా కేంద్రం లో ప్రపంచ కిన్నెర దినోత్సవం ఘనంగా జరిగింది. స్కిల్ డవలప్‌మెంట్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 114 మంది కిన్నెరలను గుర్తించినట్లు అధికారులు ప్రకటించారు. వారికి ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

పర్లాకిమిడి: ట్రాన్స్‌జెండర్లపై సమాజంలో చిన్నచూపు ఉందని, తమకు రేషన్ కార్డుల ద్వారా 35 కిలోల బియ్యం సరఫరా చేయాలని, అంత్యోదయ పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని గజపతి జిల్లా కిన్నెరుల పునరావాస సంఘం కార్యదర్శి జాస్మిన్ షేక్ డిమాండ్ చేశారు. స్థానిక గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం హాలులో జరిగిన అంతర్జాతీయ కిన్నెర దినోత్సవంలో గౌరవ అతిథిగా జాస్మిన్ షేక్ పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపును జిల్లా సామాజిక సురక్షా, దివ్యాంగుల స్వశక్తీకరణ విభాగం అధికారి సంతోష్ కుమార్ నాయక్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సబ్ కలెక్టర్ అనుప్ పండా, ట్రాన్స్‌జెండర్స్ అధ్యక్షురాలు మధు బోరాడో, నువాగడ బీడీఓ లోకనాథ శోబోరో, లక్ష్మకుమార్ ముర్ము, ఈఓ పురపాలక సంఘం, స్వాస్ స్వచ్ఛంద సంస్థ మేనేజరు పి.సునీత తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో ఇప్పటివరకూ 90 మంది కిన్నెరులు ఉన్నారని, వారు సమాజంలో మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురవుతున్నారని, వారికి సరైన రక్షణ ఇవ్వాలని, వారికి ఆశ్రయం కల్పించి అంత్యోదయ పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని ట్రాన్స్‌జెండర్స్ కార్యదర్శి జాస్మిన్ షేక్ కోరారు. కొందరు కిన్నెరులు బలవంతంగా అత్యాచారాలకు గురవుతున్నారని అటువంటి వారికి ట్రాన్స్‌జెండర్స్ ప్రొటెక్షన్ చట్టం కింద పోలీసులు రక్షణ కల్పించాలని అన్నారు. పర్లాకిమిడిలో 79 మంది కిన్నెరులలో 45మందికి ఐడెంటిటీ కార్డులు మంజూరు చేశామని, 19 మందికి పింఛన్లు, ముగ్గురికి లక్షరూపాయలు చొప్పున్న స్వయం ఉపాధి పథకం కింద క్యాంటీన్లు మంజూరు చేశామని డి.యస్.యస్.ఓ. సంతోష్ కుమార్ నాయక్ తెలియజేశారు. కార్యక్రమంలో కిన్నెరుల సంఘం సభ్యురాలు క్రాంతి బెహారా కర్మశాలకు విచ్చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి జెడ్పీ కార్యాలయం వరకు సోమవారం అంతర్జాతీయ తృతీయ లింగ దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. 90 మంది కిన్నెరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఓ వర్క్‌షాప్ నిర్వహించారు. సమాజ సేవ చేస్తున్న కిన్నెరులను గుర్తించి సత్కరించారు.



కిన్నెరల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నబరంగ్‌పూర్ కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో



కొరాపుట్‌లో దీపం వెలిగించి కిన్నెర సమావేశం ప్రారంభిస్తున్న దృశ్యం



కిన్నెరల ర్యాలీ ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి

20 యూనిట్ల రక్తం సేకరణ



కుంద్ర రక్త దాన శిబిరంలో రక్త దానం చేస్తున్న దాతలు



రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అతిథులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితి కుంద్ర గ్రామంలోగల సరస్వతీ శిశు విద్యాలయంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిశు మందిర విద్యాలయ రజిత్ జయంతి సందర్భంగా అమొఒడిశా, సంబాద్‌ల సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో కొరాపుట్ కేంద్ర విద్యాలయ అధ్యాపకులు సీతారాం రాయగురు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. శిబిరంలో డాక్టర్ హరిశ్చంద్ర ప్రధాన్, జయపురం రక్త భండార్ టెక్నీషియన్‌లు హేమాంగ, నతనీల దానీ,ప్రమోద్ ఖిలో, హరిశ్చంద్ర ప్రధాన్‌లు దాతల నుంచి 20 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా విద్యాలయ పరిచాలన కమిటీ భగవాన్ మల్లిక్, కార్యదర్శి అజిత్ కుమార్ సాహు, సహాయ కార్యదర్శి బికాశ్ చౌధురి, కోశాధికారి సుమిత్ కుమార్ సాహు, సమితి ఆర్.ఎస్.ఎస్ ప్రతినిధి వి.గిరి రావు, ఆచార్య స్వరూప్ కుమార్ దాస్, మాజీ కార్యదర్శి కృష్ణచంద్ర పాత్రో, సుజిత్ కుమార్ సాహు, జితేంద్ర ఖుండ్ తదితరులు పాల్గొన్నారు.

జయపురంలో ఆగని దొంగతనాలు



తెరిచి ఉన్న అలమార



దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారి

జయపురం: జయపురం లింగరాజ్ నగర్ ప్రాంతంలో రుద్రాక్ష నగర్ 13 వ లైన్‌లో ఉంటున్న తపన మహాపాత్రో ఇంటిలో బంగారు, వెండి నగలు దోచుకుపోయినట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి వెల్లడించారు. తపన మహాపాత్ర రాయగడలో పని చేస్తున్నారు. అతడి భార్య పిల్లలు జయపురం రుద్రాక్షనగర్ ఉంటున్నారు. ఈ నెల 27వ తేదీన ఇంటికి తాళాలు వేసి మహాపాత్ర భార్య పిల్లలతో భర్త వద్దకు రాయగడ వెళ్లింది. ఇంటికి తాళాలు వేసి ఉండటం చూసిన దుండగులు ఇంటిలో ఎవరూ లేరని నిర్ధారణ చేసుకుని శుక్రవారం రాత్రి ఇంటి వెనుక వైపుగల గోడ పై నుంచి ఇంటిలో ప్రవేశించి బీరువా తాళాలు విరిచారు. బీరువా లోపల గల బంగారు నగలు, వెండి వస్తువులు విలువైన వస్తువులు దోచుకు పోయారు. మహాపాత్రో ఇంటి పక్కన ఉంటున్న వారు శనివారం మహాపాత్రో ఇంటిలో దొంగతనం జరిగినట్లు తెలుసుకొని మహాపాత్రోకు తెలియ జేశారు. వెంటనే మహాపాత్రో రాయగడ నుంచి జయపురం వచ్చి ఇంటిలో దొంగలు ఏయే వస్తువులు దొంగిలించారో పరిశీలించి జయపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండున్నర తులాల బంగారం, అర కిలో వెండి వస్తువులు రెండు వాచీలతో పాటు కొన్ని విలువైన వస్తువులు దొంగిలించారని పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసు అధికారి వెల్లడించారు.

గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

జయపురం: గంజాయితో కారు విడిచి పరారీ అయిన కేసులో ఇద్దరిని జయపురం సదర్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారు స్థానిక ఇరిగేషన్ కాలనీ జముణగుడ వాసి ఫిరోజ్ నాగ్ (25), సమితి కార్యాలయ కాలనీ మూడో లైనకు చెందిన టులు ఖోశ్ల (26)లు అని సదర్ పోలీసు అధికారి సచిన్ ప్రధాన్ తెలిపారు. వారిని కోర్టులో హాజరు పరిచామన్నారు. ఇటీవల గగణాపూర్ పోలీసు పంటి అధికారి రాజ కిశోర్ బారిక్ నేతృత్వంలో పోలీసులు పెట్రోలింగ్ జరుపుతున్న సమయంలో గొడాపాదర్ రహదారి వంతెన వద్ద ఒక కారు నిలిచి ఉండటం కనిపించింది. పోలీసులు అనుమానంతో తనిఖీ చేయగా అందులు గంజాయి బయట పడింది. అప్పుడు వీరు పరారైపోయారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు జరిపి పట్టుకున్నారు.

సైబర్ ఉచ్చులో మాజీ హోం సహాయ మంత్రి

- రూ. 1.4 కోట్లు నిలువు దోపిడీ
- ఏడుగురు నిందితుల అరెస్టు

భువనేశ్వర్: రాష్ట్ర మాజీ హోమ్ శాఖ సహాయ మంత్రి, కాకత్‌పూర్ నియోజక వర్గం సిటింగు ఎమ్మెల్యే, విపక్ష బిజూ జనతా దళ్ నాయకుడు తుషార్ కాంతి బెహరా సైబర్ ఉచ్చులో చిక్కుకున్నారు. ఆయన ఉన్నత సాంకేతిక (ఐఐటి) విద్యాధికుడు. ఇంతటి ప్రతిష్టాత్మక వ్యక్తిని సైబర్ మోసగాళ్లు బురిడీ కొట్టించారు. నిలువునా ఒక కోటి 40 లక్షల రూపాయలు దోచుకున్నారు. కంబోడియాకు చెందిన పార్థ గోపాని గ్యాంగ్ మంత్రి తుషార్ కాంతి నుంచి ఈ సొమ్ము దోచుకుంది. ప్రభావిత మాజీ మంత్రి ఫిర్యాదుతో దర్యాప్తు బృందం హుటాహుటిన రంగంలోకి దిగి మోసగాళ్ల ముఠా సభ్యుల్ని అరెస్టు చేయగలిగింది. తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి ఏడుగురు సైబర్ నేరస్థులను అరెస్టు చేశారు. ఈ ముఠా పూర్వాపరాల వెలికితీత సన్నాహాల్లో తలమునకలై ఉంది. కేరళ, అస్సాం, పశ్చిమ బెంగాల్ వంటి అనేక ఇతర ప్రదేశాలలో దాడులు నిర్వహిస్తున్నారు. ఈ ముఠాలోని మరి కొంతమంది సభ్యులు పరారీలో ఉన్నారని భావిస్తున్నారు. ఈ సంఘటనలో రాష్ట్ర క్రైమ్ బ్రాంచ్ పోలీసులు కర్ణాటక, తమిళనాడుకు చెందిన 7 మంది సైబర్ మోసగాళ్లను అరెస్టు చేశారు. వీరిలో కర్ణాటకకు చెందిన జ్యోతి రాజు (39), రాజు, సి (34), ఇస్మాయిల్ రహాయిద్ (27), వాసిమ్ (28), తమిళనాడుకు చెందిన పట్టురాజా (34), జె. రాధా కృష్ణన్ (40), ఈ. శక్తి కుమార్‌వేల్ (50) ఉన్నారు. వీరందర్ని రిమాండ్‌పై రాష్ట్రానికి తరలించనున్నారు.

ఖోయిర్‌పూట్ సమితి కార్యాలయం ముట్టడి



ఖోయిర్‌పూట్ సమితి కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలియజేస్తున్న మహిళలు

- మంచినీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్
- ఖాళీ బిందెలతో మహిళల నిరసన

మల్కన్‌గిరి: మంచినీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు నినదించారు. దాహంతో అవస్థలు పడుతున్నామని అధికారులు స్పందించాలని వేడుకున్నారు. ఇదే డిమాండ్‌తో మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి కార్యాలయాన్ని మూడు పంచాయతీలకు చెందిన మహిళలు ఖాళీ బిందెలతో సోమవారం ముట్టడించారు. రాస్‌బేడ పంచాయతీ పరిధిలోని బాలిగూఢ, సిందిగూఢ, రాస్‌బెఢ గ్రామాల్లో తీవ్రమైన నీటిఎద్దడి నెలకుంది. వేసవి కాలం వచ్చిందంటే స్థానికంగా ఉన్న నీటి వనరులు అడుగంటిపోతుంటాయి. దీంతో బిందెడు నీటి కోసం సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న జలాశయానికి వెళ్లాల్సి వస్తుంది. సమస్యను పరిష్కరించాలని అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. సర్పంచ్, బ్లాక్ చైర్మన్‌కు వినతులు అందించినప్పటికీ ప్రయోజనం లేదని ఆరోపించారు. ఈ క్రమంలోనే తమ సమ్యను తీర్చాలంటు భారీగా మహిళలు తరలివచ్చి ఖాళీ బిందెలతో సమితి కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలియజేశారు. తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించాలని, శాశ్వత నీటి సరఫరా కోసం చర్యలు తీసుకోవాలని, సమస్య పరిష్కారం అయ్యే వరకూ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతిపత్రాలను అందజేశారు.

సేవా పేపరు మిల్లు కాంట్రాక్ట్ కార్మికుని హత్య



రోడ్డుపై పడి ఉన్న పద్మన్ బైక్

జయపురం: జయపురం సదర్ పోలీసు స్టేషన్ పరిధి గగణాపూర్‌లోగల సేవా పేపర్ మిల్లులో కాంట్రాక్టు కార్మికుడిని కొందరు దుండగులు హత్య చేశారు. హతుడిని జయపురం సమితి పంపుణి గ్రామం పద్మన్ హరిజన్(49)అని గుర్తించారు. సమాచారం అందుకున్న గగణాపూర్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు."విషయం జయపురం సదర్ పోలీసులకు తెలియజేశారు. పద్మన్ రోజూ లాగానే ఆదివారం కూడా గగణాపూర్‌లో గల సేవాపేపరుమిల్లుకు పనికి వెళ్లాడు. సాయంత్రం డ్యూటీ అయ్యాక తన బైక్‌పై గ్రామానికి బయల్దేరాడు. గగణాపూర్ నుంచి రాణీపుట్ మార్గంలో గ్రామానికి వెళ్తుండగా బొనగుడ గ్రామం హనుమాన్ మందిరం సమీపంలో ఎవరూ లేని సమయం గుర్తించి కొంత మంది అతడిని చుట్టుముట్టి దాడి చేశారు. అతను విడిపించుకుని పరిగెత్తుకుని వెళ్లిపోయినా విడవకుండా వెంబడించి హతమార్చారు. గ్రామస్తులు మృతదేహాన్ని చూసి పోలీసులకు విషయం చెప్పారు. జయపురం సదర్ పోలీసు అధికారి సచింద్ర ప్రధాన్, మరియు స్వతంత్ర నేర నియంత్రణ అధికారి, మాజీ పట్టణ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి సంఘటన ప్రాంతానికి చేరుకొని పద్మన్ మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

జలాశయంలో రొయ్య పిల్లల విడుదల



జలాశయంలో రొయ్య పిల్లలను విడిచిపెడుతున్న ఎమ్మెల్యే మంగుఖీలో, మత్స్యశాఖ అధికారులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి జలాశయంలో నాలుగు లక్షల రొయ్య పిల్లలను చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖీలో సమక్షంలో మత్స్యశాఖాధికారులు సోమవారం విడుదల చేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి సుశాంత్ గౌడ పర్యవేణలో తొలిదశగా నాలుగు లక్షల రొయ్య పిల్లలను జలాశయంలో విడుదల చేశామన్నారు. భవిష్యత్‌లో మరో 13 లక్షల పిల్లలను విడిచిపెట్టే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే మంగు మాట్లాడుతూ.. చేపల ఉత్పతులు, మార్కెటింగ్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సమారి టంగులు, చిత్రకొండ సమితి అధ్యక్షురాలు రాజేశ్వరి ఖీలో, సమితి సభ్యుడు రాజకమల్ పురోహిత్ ఉన్నారు.

రూ.3 కోట్ల నిధులు మంజూరు



ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: ఉత్కళ దివాస్ సందర్భంగా ప్రజలందరికీ పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పర్లాకిమిడి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు రూ.3 కోట్లు ఎమ్మెల్యే లాడ్ నిధులను సోమవారం మంజూరు చేశారు. స్థానిక రాంనగర్ హైటెక్ ప్లాజాలో జరిపిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. పర్లాకిమిడి జగన్నాథ మందిరం పునః నిర్మాణ పనులకు ఎమ్మెల్యే లాడ్ నిధుల నుంచి రూ.50 లక్షలు, పట్నాయక్ చెరువు అభివృద్ధి పనులకు రూ.6లక్షలు, మహేంద్ర తనయ వద్ద శ్మశాన వాటిక నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేశారు. గుసాని సమితిలో పలు గ్రామాలకు రూ.1.15 కోట్లు, కాశీనగర్ సమితిలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.56 లక్షలు, గుమ్మా సమితికి తొలి పర్యాయం రూ.15 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

నబరంగ్‌పూర్‌లో హైకోర్టు జడ్జి పర్యటన



హైకోర్టు జడ్జిను కలిసిన సీనియర్ న్యాయవాదులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో హైకోర్టు న్యాయమూర్తి చిత్తరంజన్ దాస్ సోమ వారం పర్యటించారు. జిల్లా కేంద్రంలోని సర్క్యూట్ హౌస్‌కి చేరుకున్నారు. అక్కడ జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు సిరాజుద్దీన్ అహ్మద్, సీనియర్ న్యాయవాదులు జడేశ్వర్ ఖడంగా, సి.హెచ్.బాబా యుగంధర్ తదితరులు ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో భేటీ అయ్యారు. జిల్లా కోర్టుల సముదాయాన్ని సందర్శించారు. సాయంత్రం శక్తిపీఠం బండారు ఘరణి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. రాజ పురోహితుడు నర్సింగ త్రిపాఠి స్వాగతం పలికారు.

నేడు రాష్ట్ర అవతరణ దినోత్సవం



విద్యుత్ వెలుగుల్లో పర్లాకిమిడి పురపాలక కార్యాలయం

పర్లాకిమిడి: ఈ నెల 1వ తేదీన ఒడిశా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు, ఉత్కళ దివాస్ సందర్భంగా రాష్ట్ర వాణిజ్య, వైద్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ మంగళవారం పర్లాకిమిడి రానున్నారు. ఉత్కళ దివాస్ వేడుకల్లో పాల్గొనున్నట్టు కలెక్టర్ సోమవారం తెలియజేశారు. పట్టణంలోని పురపాలక, కలెక్టరేట్, రెవెన్యూ శాఖ, ఆర్టీఓ, ప్రభుత్వ బ్యాంకులను విద్యుత్ వెలుగులతో తీర్చిదిద్దారు. పర్లాకిమిడిలో మహారాజా కృష్ణ చంద్రగజపతి నారాయణ దేవ్ ఘాట్ వద్ద మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు నివాళులర్పించనున్నారు.

బుడితిలో బంగారం చోరీ

సారవకోట: మండలంలోని బుడితి గ్రామంలో మూడు తులాల బంగారం చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుడితి గ్రామానికి చెందిన శిమ్మ రామారావు దంపతులు ఆదివారం హైదరాబాద్‌లో బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటి పనిమనిషి నాగమ్మ అటువైపుగా వెళ్లగా తలుపులు పగలగొట్టి ఉండటాన్ని గమనించింది. వెంటనే ఇంటి యజమానికి ఫోన్‌లో సమాచారం అందించింది. వారు నరసన్నపేటలో నివాసం ఉంటున్న రామారావు అల్లుడైన గిరీష్ కుమార్‌కు సమాచారం ఇవ్వగా ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు తులాల చైన్, అర తులం బరువైన రెండు ఉంగరాలు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. ఎస్‌ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ గ్రామంలో ఎనిమిది నెలల వ్యవధిలో నాలుగు దొంగతనాలు జరగడం గమనార్హం.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఉగాది

- కొరాపుట్ ఎంపీ సప్తగిరి
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రాయగడ:

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ఉగాది వేడుకలు ప్రతీకలని కొరాపుట్ పార్లమెంటు సభ్యుడు సప్తగిరి శంకర్ ఉలక అన్నారు. రాయగడలోని తేజస్వీ మైదానంలో రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు నేతృత్వంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఉగాది ఉత్సవాలు అందరినీ అలరించాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ.. ఒడిశా రాష్ట్రం విభిన్న సంస్కృతులకు పుట్టినిల్లన్నారు. వాటిని గౌరవించడం మన బాధ్యత అన్నారు. రాయగడ వంటి జిల్లాలో తెలుగు ప్రజలు జరుపుకునే ఉగాది, ఒడియా ప్రజలు జరుపుకునే పాణా సంక్రాంతి వంటివి అంతా కలసిమెలసి నిర్వహించుకోవడం ఇక్కడ ప్రజల ఐక్యతకు మారుపేరని అన్నారు. ఇటువంటి సంప్రదాయాలను కొనసాగించడంతో పాటు వాటిని పరిరక్షించి భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. నెక్కంటి ఆధ్వర్యంలో 13 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ వేడుకలు ఎంతో ఘనంగా జరుపుకోవడంతో పాటు అందుకు ప్రజల నుంచి కూడా ఇంతటి స్పందన లభించడం అభినందించాల్సిన విషయమన్నారు. ఉగాది వేడుకలకు తనను ఆహ్వానించడం.. ఇలా అందరిమధ్య సంతోషాలను పాలుపంచుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాయగడ, బిసంకటక్ ఎంఎల్‌ఏలు అప్పలస్వామి కద్రక, నీలమాధవ హికక గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించేందుకు వచ్చిన జనం

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఉగాది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సినీనటుడు, మిమిక్రీ ఆర్టిస్టు శివారెడ్డి తన ప్రదర్శనలతో ప్రేక్షకులను గంటన్నర సమయం ఉర్రూతలూగించారు. అలాగే డీటీఎస్ ఆనంద్ తన గొంతుతో డీటీఎస్ మ్యూజిక్‌ను ఆలపించారు. హైదరాబాద్‌కు చెందిన డ్యాన్స్ కంపెనీ నిర్వహించిన వివిధ నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఎల్ఈడీ కాస్ట్యూమ్స్‌తో చేసిన నృత్యాలు ఆనందడోలికల్లో ముంచాయి. ఈ కార్యక్రమాలకు వ్యాఖ్యతగా హారిక వ్యవహరించారు. అంతకుముందు ప్రముఖ వేద పండితులు రేజేటి శ్రీనివాస్ శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు నెక్కంటి భాస్కరావు పూజా కార్యక్రమాల్లో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఉగాది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదర్శించారు.



పూజా కార్యక్రమాల్లో రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి



శివారెడ్డి మిమిక్రీ ప్రదర్శన



అలరిస్తున్న యాంకర్ హారిక



హైదరాబాద్ కళాకారుల నృత్య ప్రదర్శన



అలరిస్తున్న నృత్యాలు



కొరాపుట్ ఎంపీ సప్తగిరిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు
ఫొటో-60(జి)-సినీనటి నటాసను సన్మానిస్తున్న దృశ్యం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యేలు హికక, కద్రకలు

అమర సైనికుడికి నివాళులు



ముఖ్యమంత్రి శ్రద్ధాంజలి



రాజ్ కిషోర్

భువనేశ్వర్: అమరవీరుడైన సైనికుడు రాజ్ కిషోర్ ముండాకు ముఖ్యమంత్రి నివాళులు అర్పించారు. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అమర సైనికుని శవ పేటిక దగ్గర పుష్ప గుచ్ఛం ఉంచి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. కెంఝొహర్ సదరు మండలం నువాగాంఖ్‌కు చెందిన జవాన్ రాజ్ కిషోర్ ముండా మార్చి 29వ తేదీన అమరుడయ్యాడు. బీహార్ రెజిమెంట్‌లోని 6వ బెటాలియన్ సైనికుడు. అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ ప్రాంతంలో విధి నిర్వహణలో అంతిమ త్యాగం చేశాడు.



పుష్ప గుచ్ఛంతో నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి

అంత్యోదయ గృహ యోజన పథకం ఆరంభం



మహిళలకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ తదితరులు

మల్కన్‌గిరి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అంత్యోదయ గృహ యోజన పథకాన్ని మల్కన్‌గిరి జిల్లా సమితి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ సోమవారం ప్రారంభించారు. తొలుత ఈ పథకానికి కలహండి జిల్లా భవానీపట్నంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదివారం శ్రీకాకరం చుట్టారు. ఈ పథకం ద్వారా నిరుపేదలు, వితంతువులు, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయినవారు, తీవ్రమైన వ్యాధులతో బాపడేవారు, దివ్యాంగులకు గృహాలను మంజూరు చేస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,629 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. నాలుగు నెలల్లో గృహ నిర్మాణం పూర్తయితే రూ. 20 వేలు, ఆరు నెలలో పూర్తయితే రూ. పది వేలు ప్రోత్సాహకంగా అందజేస్తారు. 95 రోజులు ఉపాధి పనులు కల్పిస్తారు. అలాగే ఇళ్లకు విద్యుత్, తాగునీరు, గ్యాస్, టాయిలెట్ సదుపాయాలను కల్పిస్తారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఒకొక్కరికీ రూ. లక్షా 20 వేలు విలువైన చెక్కులను అందజేశారు. మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, మల్కన్‌గిరి సమితి అధికారి తపన్ కుమార్ సేనాపతి, జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్‌చంద్ర శబర, స్వయం సహాయక సంఘ మహిళాలు, కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎచ్చెర్ల: లావేరు మండలం రావివలస సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. లావేరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పిన్నింటి రాము, మరో వ్యక్తి సుభద్రాపురం నుంచి విశాఖ వైపు కారులో వెళ్తుండగా హైవే పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇద్దరికీ కాళ్లు విరగడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

కుర్రకారు వీరంగం



యువకుల కారుకు రెడ్ లైట్ అమరిక.

భువనేశ్వర్: నగరంలో కుర్రకారు చేష్టలు మితిమీరిపోతున్నాయి. కొందరు కుర్రాళ్లు కారుకు రెడ్ లైట్ అమర్చుకుని తప్పతాగి కారు నడిపారు. పోలీసులు పసిగట్టి కారుని నిలదీసి తనిఖీ చేశాక అసలు వ్యవహారం బట్టబయలైంది. తప్ప తాగి కారు నడుపుతున్న మూకని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.




పోలీసులకు చిక్కిన కుర్ర మూక

ఠాకురాణి అమ్మవారికి కానుకల సమర్పణ



కావిడితో కానుకలు తెస్తున్న భక్తులు




నబరంగ్‌పూర్‌లో బుడి ఠాకురాణి అమ్మవారు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో వెలసిన బుడి ఠాకురాణి అమ్మవారికి పుట్టింటి నుంచి కానుకలు తరలి వచ్చాయి. చైత్ర మాసం సందర్భంగా సోమవారం నుంచి అమ్మవారు ప్రతి రోజు పురవీధులలో పర్యటించనున్నారు. అమ్మవారి ఘటాలకు వీధులలో మహిళలు కానుకలు, పసుపు నీళ్లతో మొక్కుబడులు చెల్లిస్తారు. తొమ్మిది రోజులు అమ్మవారికి కావలసిన వస్త్రాలు, పూజా సామగ్రి, పూజారులకు వస్త్రాలు సమర్పించారు. ఇందులో భాగంగా పట్టణంలోని గౌడ వీధిలోని పుట్టింటి నుంచి తరలివచ్చాయి. శతాబ్దాల క్రితం అమ్మవారు గౌడవీధిలో పుట్టి రాజు వీధికి తరలి వచ్చినట్లు ప్రజలు విశ్వసిస్తారు. అందువలన పుట్టింటి వారైన గౌడ వీధి ప్రజలు ఏటా అమ్మవారికి తొమ్మిది రోజులకు సరిపడా పూజా సామగ్రి అందజేస్తారు. మేళతాళాలతో ఊరేగింపు కావిళ్లతో పూజా సామగ్రి బుడి ఠాకురాణి అమ్మవారి గుడికి అందజేశారు.



ఊరేగింపుతో వస్తున్న పుట్టింటి వారైన గౌడ వీధి ప్రజలు

పర్లాకిమిడిలో ఘనంగా రంజాన్



ముస్లింలకు ఈద్ ముబారక్ తెలుపుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి



జుమ్మా మసీదులో ఎమ్మెల్యేతో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

పర్లాకిమిడి: సోమవారం ఉప్పరవీధిలో ఉన్న జమ్మా మసీద్‌లో ఈదుల్ ఫితుర్ పండుగ సందర్భంగా ముస్లింలు ఆరోగ్యవీధి మార్కెట్ మీదుగా శాంతియుతంగా ర్యాలీ జరిపారు. అనంతరం ఉప్పరవీధి జమ్మా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి పాల్గొని ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ తెలిపారు.



మటియా వీధిలో ముస్లింలతో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

శ్రీరామ నవమి ఉత్సవాలకు శ్రీకారం



శ్రీరామ నవమి వేడుకలకు ముస్తాబవుతున్న రఘునాథ్ మందిరం



జయపురం పట్టణ ప్రధాన మార్గంలో స్వాగత ద్వారాలు

జయపురం: ఈ నెల ఆరో తేదీన జరుగనున్న శ్రీరామ నవమి ఉత్సవాలకు జయపురం పట్టణంలో విస్తృత సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా స్థానిక రఘునాథ్ మందిరం ఆవరణలో సోమవారం మూహూర్తపు రాట వేశారు. కార్యక్రమంలో శ్రీరామ నవమి పూజా కమిటీ సభ్యులతో పాటు పట్టణంలోని శ్రీరామ భక్తులు, పలు సంస్థల ప్రతినిధులు పాల్గున్నారు. ఈ సందర్భంగా పూజా కమిటీ సభ్యులు జయపురం మహారాణిని శ్రీరామ నవమి పూజా కార్యక్రమాలకు ఆహ్వానించారు. అన్ని గ్రామాల నుంచి రామ భక్త బృందాలు రఘునాత్ మందిరంలో జరుపగనున్న శ్రీరామనవమి వేడుకలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పట్టణంలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేస్తున్నారు. రఘునాథ్ మందిరాన్ని అందంగా తీర్చి దిద్దుతున్నారు. స్థానిక జమాల్ లైన్‌లో శ్రీరామ నవమి ఉత్సవాలు జరిపేందుకు శ్రీసీతా రామాంజనేయ ఆలయ కమిటీ సన్నాహాలు చేస్తున్నది.



జయపురం మహారాణిని ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు



రఘునాథ్ మందిర శ్రీరామ నవమి ఉత్సవ కమిటీ సభ్యులు

అంత్యోదయ గృహ పథకం ప్రారంభం



వర్క్ ఆర్డర్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్‌లో అంత్యోదయ గృహ పథకం ప్రారంభానికి మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో ముఖ్యఅతిథిగా విచ్చేసి 28 మంది లబ్ధిదారులకు వర్క్ ఆర్డర్లను పంపిణీ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్‌మఝి ఉగాది రోజు ఈ పథకం ప్రారంభించారు. జిల్లాలో రాయఘడ, గుసాని బ్లాక్, మోహనాలలో కలెక్టర్ బిజయకుమార్ దాస్ ఈ పథకాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాయఘడ బ్లాక్ అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్, డి.ఆర్.డి.ఎ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శంకర్ కెరకెటా, ప్రోగ్రాం మ్యానేజర్ బి.రోహిత్ కుమార్, రాయఘడ బి.డి.ఓ సుకాంత కుమార్ ప్రదాన్, అసిస్టెంట్ ఇంజినీర్ సిద్ధార్థ శంకర్ త్రిపాఠీ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు


తిరుపతిరావు (ఫైల్)

వీరఘట్టం/పాలకొండ రూరల్: మండలంలోని తూడి జంక్షన్ వద్ద సీఎస్పీ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మీసాల తిరుపతిరావు (39) అనే వ్యక్తి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై జి.కళాధర్ సోమవారం తెలిపారు. మృతుని భార్య సరస్వతి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. బైక్‌పై వస్తున్న తిరుపతిరావును వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. తిరుపతిరావు మృతితో పాలకొండ మండలం పొట్లిలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్యతో పాటు హర్షవర్ధన్, సుధీర్ అనే ఇద్దరు కుమారులున్నారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు..?


కారులో ఉన్న గంజాయి ప్యాకెట్లు (ఫైల్)

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఫిబ్రవరి 10వ తేదీన ఒడిశా నుంచి తరలిస్తున్న 150 కిలోల గంజాయి పోలీసులకు పట్టుబడగా.. కారు వదిలేసి అందులో ఉన్న నిందితులు పరారైన సంగతి తెలిసిందే. వెంటనే ఈ వ్యవహారంపై సీఐ నారాయణరావు, ఎస్సై వి. ప్రసాదారావు కేసు నమోదు చేసి ముమ్మర దర్యాప్తు చేపట్టడంతో నలుగురు నిందితులు దొరికి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. అదుపులో ఉన్న నలుగురు నిందితుల్లో ఒకరు అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు గ్రామానికి చెందిన వాడు కాగా.. ఇద్దరు విశాఖ జిల్లా అనందరంపురానికి చెందిన వారని తెలిసింది. అలాగే ఇంకొకరు విజయనగరం జిల్లా ఎస్.కోటకు చెందిన వ్యక్తి అని సమాచారం. వీరు ఈ గంజాయిని ఎక్కడి నుంచి తెస్తున్నారు..? ఎక్కడికి తీసుకెళుతున్నారు..? అక్రమ రవాణా వెనుక ఎవరున్నారు..? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. నిందితులను ఎస్పీ ఎదుట మంగళవారం హాజరుపరచనున్నట్లు సమాచారం.

జోరుగా గ్రావెల్ తవ్వకాలు


జేసీబీ సహాయంతో గ్రావెల్ తవ్వకాలు

భామిని: మండలంలోని బురుజోల – పసుకుడి మెట్ట వద్ద గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. మూడు రోజులుగా తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏకంగా జేసీబీలతో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్ల సహాయంతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తవ్వకాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వే ట్రాక్‌పై మృతదేహం



రైల్వే ట్రాక్‌పై పడి ఉన్న మృతదేహం ఇన్‌సెట్లో అరుణ బలేరా (ఫైల్)

సీతానగరం: మండలంలోని సీతానగరం – గుమ్మిడివరం గ్రామాల మధ్య గల రైల్వే ట్రాక్‌పై ఓ వ్యక్తి మృతదేహాన్ని సోమవారం గుర్తించారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న రైల్వే హెచ్‌సీ బి. ఈశ్వరరావు మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైలు నుంచి జారిపడి మృతి చెందాడా.. లేక రైలు ఢీ కొనడం వల్ల ప్రమాదం జరిగిందా అన్న విషయమై పోలీసులు విచారణ చేపడుతున్నారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలను బట్టి అతను ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన అరుణ బలేరా (40) సన్నాఫ్ మోహన్ బలేరాగా గుర్తించారు.

కానిస్టేబుల్‌కు సీమంతం

సాలూరు: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బి. ప్రమీలకు ఏఎస్పీ అంకిత సురానా, సహచర సిబ్బంది సోమవారం స్థానిక స్టేషన్ ఆవరణలో సీమంతం చేపట్టారు. పీఎస్‌ను తనిఖీ చేయడానికి వచ్చిన ఏఎస్పీ అంకిత సురానాకు మహిళా కానిస్టేబుల్ గర్భంతో ఉన్న విషయం తెలిసింది. వెంటనే సహచర సిబ్బంది సహకారంతో సీమంతం నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మహిళా కానిస్టేబుల్‌కు సీమంతం నిర్వహించడంపై ఏఎస్పీని పలువురు అభినందించారు.


మండుతున్న ఎండలు..
జాడలేని చలివేంద్రాలు!



- 40 డిగ్రీలకు చేరుకుంటున్న ఉష్ణోగ్రతలు
- ఉదయం నుంచే ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు, ప్రయాణికులు
- చలివేంద్రాలపై ప్రకటనలకే పరిమితమవుతున్న అధికారులు

సాక్షి, పార్వతీపురం మన్యం:


జిల్లాలో మార్చి నెలలోనే ఎండలు తారెత్తించాయి. 40 డిగ్రీలకు పగటి ఉష్ణోగ్రతలు చేరుకున్నాయి. ఇంకా ఏప్రిల్ మొదలైంది. ముమ్ముందు ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ ప్రభావం కనిపిస్తోంది. మధ్యాహ్నం 12 గంటలయ్యేసరికి రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రమైనా వేడి వాతావరణం తగ్గడం లేదు. ఇళ్లలో ఉన్నప్పటికీ.. ఏసీలు, కూలర్లు ఉంటేనే గానీ.. భరించలేని పరిస్థితి. వేడిగాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జిల్లాలోని బలిజిపేట, భామిని, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, పార్వతీపురం, సీతానగరం తదితర మండలాల్లో 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.



జిల్లాలోని 15 మండలాల పరిధిలో గత నెల 30వ తేదీన నాలుగు మండలాలు, 31న 10 మండలాల్లో వేడిగాలుల ప్రభావం కనిపించింది. ఈ నెల ఒకటో తేదీన మంగళవారం కూడా ఎనిమిది మండలాల్లో వేడిగాలులు ఉంటాయని విపత్తుల నిర్వహణ శాఖ చెబుతోంది. వారం రోజుల కిందట రాత్రి వేళ కురిసిన గాలులు, వర్షం మినహాయించి.. మిగిలిన రోజుల్లో చినుకు జాడ లేకపోవడంతో మూగజీవాలు సైతం నీటి కోసం అల్లాడిపోతున్నాయి. పశువులకు తాగునీరు అందించేందుకు జిల్లాలో 411 పశువుల తొట్టిలు మంజూరయ్యాయి. వీటి పనులు ప్రారంభించాల్సి ఉంది.

కానరాని చలివేంద్రాలు

గతంలో వేసవిలో ప్రభుత్వపరంగా మంచినీటి చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకునేవారు. మండల కేంద్రంతో పాటు.. రద్దీ కూడళ్లలో వీటిని ఏర్పాటు చేసేవారు. ఇందుకోసం ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు కేటాయించేవి. దీంతో పాటు.. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సహకారంతో కొన్ని ప్రాంతాల్లో మజ్జిగ, మంచినీటి చలివేంద్రాలు వెలిసేవి. ఏప్రిల్ వస్తున్నా ప్రభుత్వపరంగా చలివేంద్రాల జాడ ఎక్కడా లేదు. కేవలం అధికారుల ప్రకటనలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు ప్రయాణికులు, వాహనచోదకుల నుంచి వ్యక్తమవుతున్నాయి. దాహం వేస్తే మంచినీటి బాటిళ్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. రూ.20 చొప్పున నీటి బాటిల్ కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని బాటసారులు, వాహనచోదకులు చెబుతున్నారు. దీనిని వ్యాపారులు సొమ్ముచేసుకుంటున్నారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో శుద్ధిచేయని నీటినే సీసాల్లో నింపి విక్రయిస్తున్నారు. ఇటువంటి నీటిని తాగడం వల్ల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఉపాధి హామీ పనుల వద్ద మజ్జిగ, తాగునీరు, మెడికల్ కిట్లు, టెంట్లు వంటివి కానరావడం లేదు. ఎండల్లోనే వేతనదారులు పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రత్యేకంగా పనుల వద్ద ఈ సౌకర్యాలు కల్పించడానికి పెద్ద ఎత్తున నిధులు విడుదలవుతున్నా.. క్షేత్రస్థాయిలో వాటి జాడ కనిపించడం లేదు.





ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందువల్ల వడదెబ్బ బారిన పడకుండా వివిధ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యనిపుణులు చెబుతున్నారు.

- ఎక్కువగా నీటిని తాగాలి. కొబ్బరినీరు, ఓఆర్ఎస్ ద్రావణం, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు వంటివాటితోపాటు.. నీటి శాతం అధికంగా లభించే కర్బూజా వంటివాటిని తీసుకోవాలి.
- వీలైనంత వరకు ఎండలో తిరగడం తగ్గించాలి(ముఖ్యంగా మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల్లోపు). తప్పనిసరి పరిస్థితుల్లో టోపీ, చలువ కంటి అద్దాలు, గొడుగు ధరించాలి. లేత కాటన్ రంగు దుస్తులను ధరించాలి.
- శీతల పానీయాలకు దూరంగా ఉండాలి. సురక్షిత నీటినే తాగాలి.
- తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లినప్పుడు తల తిరగడం, వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని వైద్యుడిని సంప్రదించాలి.
- ఇంటి వాతావరణం చల్లగా ఉంచుకోవాలి.

తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోండి

- టెలికాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన కలెక్టర్


టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురంటౌన్: జిల్లాలో నీటి నాణ్యత పరీక్షలు ఎప్పటికప్పుడు నిర్వహించాలని, వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చలివేంద్రాలు విరివిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను సోమవారం టెలికాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. ఆరోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు సంయుక్తంగా నీటినాణ్యత పరీక్షలు పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రధాన కూడళ్లు, గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో అవసరమైన అన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న కార్యాలయాలు, సంస్థలు, సంఘాల సహకారంతో చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీలు, ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎండ ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో ఉపాధిహామీ పనుల సమయాల్లో మార్పులు చేయాలన్నారు. పశుసంవర్ధకశాఖ ప్రతిపాదనల మేరకు జిల్లాలో 411 పశువుల తొట్టిలను తక్షణమే నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు.

ప్లేట్ కాంపోనెంట్ ప్రారంభం


ప్లేట్ లెట్స్ కాంపోనెంట్ యూనిట్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని రెడ్‌క్రాస్ సొసైటీలో సీఎస్ఆర్ నిధులు రూ.76.01 లక్షలతో ఏర్పాటు చేసిన ప్లేట్ లెట్స్ యూనిట్‌తో పాటు, ఎస్‌డీపీ యూనిట్‌ను రాష్ట్ర ఎంఎస్ఎంఈ సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ విశేషమైన సేవలను అందిస్తోందన్నారు. కాంపోనెంట్ యూనిట్ ద్వారా ఉమ్మడి జిల్లాల్లో అవసరమైన వారికి రక్తంతో పాటు రెడ్ బ్లడ్ సెల్స్, ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా, ప్లేట్ లెట్స్, క్రయాప్రెసిపిరేట్, సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్‌ను సరఫరా చేస్తుందన్నారు. ఆరోగ్య వంతులంతా ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, రెడ్‌క్రాస్ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు, కార్యదర్శి సత్యం, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం.జయచంద్రనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్స్‌తో రిజిస్ట్రేషన్లు

విజయనగరం రూరల్: రిజిస్ట్రేషన్లను మరింత సులభతరం చేయడానికి ప్రభుత్వం తీసుకు వచ్చిన స్లాట్ బుకింగ్ విధానాన్ని ఈ నెల రెండో తేదీ నుంచి విజయనగరం ఆర్వో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రారంభించనున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ ఎ.నాగలక్ష్మి తెలిపారు. పట్టణంలోని దాసన్నపేటలో ఉన్న ఆర్వో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్ట్రార్ ఏవీ కుమారితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూ క్రయ, విక్రయదారులకు సమయం వృథా కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానం తీసుకువచ్చిందని చెప్పారు. ఈ విధానం వల్ల పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయన్నారు. పబ్లిక్ డేటా ఎంట్రీ విధానం ద్వారా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

మరో సైబర్ మోసం..

- ఏఎస్సైనంటూ పరిచయం చేసుకుని డబ్బులు వసూలు చేసిన వైనం
- బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు


సైబర్ నేరంపై పిర్యాధు చేస్తున్న పొట్నూరు శ్రీనివాసరావు

సంతకవిటి: మండలంలో మరో సైబర్ మోసం చోటుచేసుకుంది. ఏఎస్సైనంటూ ఓ వ్యక్తి కొంత మందిని పరిచయం చేసుకుని డబ్బులు వసూలు చేసి మోసగించాడు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఆర్. గోపాలరావు తెలియజేసిన వివరాల మేరకు.. వినాయక మోడరన్ రైస్ మిల్, వినాయక ట్రేడర్స్ యజమాని పొట్నూరు శ్రీనివాసరావుకు శనివారం సాయంత్రం అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. తాను మండల పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా వచ్చిన ఏఎస్సైనని.. ఎస్సై కుమారుడికి బాగోలేకపోవడంతో శ్రీకాకుళం ఆస్పత్రిలో చేర్పించామని చెప్పాడు. అర్జంటుగా ఎస్సైకి డబ్బులు పంపించాలి.. నా దగ్గర క్యాష్ ఉంది, మీరు నాకు ఫోన్‌పే చేస్తే నేను ఆయనకు డబ్బులు పంపిస్తాను.. మీరు స్టేషన్‌కు వచ్చి డబ్బులు తీసుకోండని అపరిచిత వ్యక్తి చెప్పారు. అయితే శ్రీను తన దగ్గర డబ్బుల్లేవని బదులివ్వడంతో.. నేను కొత్తగా వచ్చాను, నాకు ఎవ్వరూ పరిచయస్తులు లేరు.. తెలిసిన వారుంటే చెప్పమని అపరిచిత వ్యక్తి కోరాడు. దీంతో శ్రీను స్పందిస్తూ సంతకవిటికి చెందిన బొద్దాన సుధాకర్, గరికిపాడు గ్రామానికి చెందిన కోరాడ సంతోష్‌కుమార్, వాసుదేవపట్నం గ్రామానికి చెందిన మొదలవలస అప్పలసూరిలతో మాట్లాడి వాళ్ల ఫోన్ నంబర్లు ఇచ్చాడు. వారికి అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి రూ. 12 వేలు, రూ. 15 వేలు, రూ. 70 వేలు ఫోన్ పే చేయించుకున్నాడు. మరుచటి రోజు వారంతా డబ్బులు తీసుకునేందుకు స్టేషన్‌కు వెళ్లగా.. కొత్త ఏఎస్సైగా ఎవ్వరూ రాలేదని సిబ్బంది బదులిచ్చారు. వెంటనే అపరిచత వ్యక్తి నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై గోపాలరావు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తా


బోల్తా పడిన లారీ

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం సమీపంలో (సాలూరు-విశాఖపట్నం రోడ్డు) ఐరన్ రేకులతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఇందుకు సంబంధించి ట్రాఫిక్ సీఐ సూరినాయుడు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయ్‌పూర్ నుంచి విశాఖకు ఇనుప రేకులతో వెళ్తున్న లారీ ఎస్పీ కార్యాలయం సమీపంలో వాటర్ ట్యాంక్ వద్ద మలుపు తిప్పే క్రమంలో ఒక్కసారిగా తిరగబడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు చిన్న చిన్న గాయాలయ్యాయి. అటు ఎస్పీ ఆఫీస్, ఇటు డీఎస్పీ ఆఫీసుకు ఆమడ దూరంలో లారీ బోల్తా పడింది. సెలవు రోజు కావడంతో జనసంచారం పెద్దగా లేదు. లేదంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని లారీని తొలగించారు.

న్యాయం చేయాలి..


వల్లంపూడి స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న బాధితులు, శింగవరం గ్రామస్తులు

- వల్లంపూడి స్టేషన్ వద్ద బైఠాయించిన బాధితులు
- సీఐ చొరవతో ఆందోళన విరమణ

వేపాడ: ఓ భూ వివాదంపై వల్లంపూడి ఎస్సై బి. దేవి తమకు న్యాయం చేయడం లేదని.. ఫిర్యాదు కూడా నమోదు చేయడం లేదని ఆరోపిస్తూ శింగవరం గ్రామానికి చెందిన మైచర్ల జయమ్మ, అప్పన్నదొర, భారతి, తదితరులు సోమవారం స్థానిక వల్లంపూడి పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన నిర్వహించారు. బాధితులకు అండగా గ్రామస్తులు అధిక సంఖ్యలో చేరుకుని బైఠాయించారు. మార్చి 26న తమపై ప్రత్యర్థులు దాడి చేసి గాయపరిచారని, ఫిర్యాదు చేయడానికి వస్తే కనీసం ఫిర్యాదు కూడా తీసుకోలేదని బాధితులు జయమ్మ, అప్పన్నదొర, భారతి వాపోయారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఎల్.కోట ఎస్సై సీహెచ్ నవీన్ పడాల్ వల్లంపూడి చేరుకుని బాధితులతో మాట్లాడారు. ఇదే సమయంలో ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు కూడా చేరుకుని ఏమైనా సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలే తప్ప ఇలా చేయకూడదని సూచించారు. పెద్దలతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని సీఐ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

గంట్యాడ: అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. కొర్లాం గ్రామానికి చెందిన ఇందుకూరి స్నేహితగుప్తాకు (9) ఆదివారం సాయంత్రం జ్వరం రావడంతో వారి తాత, అమ్మమ్మలు లక్కిడాం జంక్షన్‌లో ఉన్న ఓ ప్రైవేట్ క్లినిక్‌కు తీసుకెళ్లారు. సోమవారం సాయంత్రం మరలా గుప్తాకు వాంతులు కావడంతో విజయనగరంలో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. సర్వజన ఆస్పత్రి వైద్యులు బాలుడ్ని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. అయితే మృతిపై అనుమానాలున్నాయని కుటుంబ సభ్యులు ఆరోపించడంతో మృతదేహానికి పోస్టుమార్టం చేయాలని నిర్ణయించి, మార్చురీ గదికి తరలించారు.

స్నేహిత గుప్తా తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. చిన్నారి తాతగారింట్లో ఉంటూ ఓ ప్రైవేట్ పాఠశాలలో 3వ తరగతి చదువుకుంటున్నాడు.

హత్య కేసు ఛేదన


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అంకితా సురాన

సాలూరు రూరల్: మండలంలోని చీపురువలస సమీపంలో గల జీడితోటలో యువతి మృతదేహాన్ని మార్చి 28న గుర్తించిన సంగతి తెలిసిందే. యువతి అనుమానాస్పదంగా మృతి చెందిందని భావించిన పోలీసులు విచారణ చేపట్టిన 48 గంటల్లో ఛేదించి హత్యగా నిర్ధారించారు. ఈ మేరకు సోమవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్పీ అంకితా సురాన కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించింది... మండలంలోని దత్తివలస గ్రామానికి చెందిన పెరుమాళ్ల రాంబాబు (శ్రీరామ్) ఆరు నెలల కిందట పసుపువానివలస గ్రామంలో జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొనగా.. ఐశ్వర్య అనే అమ్మాయితో పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం ఇలా కొనసాగుతుండగా ఈ సంవత్సరం జనవరిలో విశాఖపట్నం పైనాపిల్ కాలనీలో తామిద్దరం భార్యాభర్తలమని చెప్పి ఓ ఇల్లు అద్దెకు తీసుకున్నారు. అయితే రాంబాబుకు అప్పటికే వివాహం అయిన సంగతి ఐశ్వర్యకు చెప్పలేదు. ఇటీవల కాలంలో తనను పెళ్లి చేసుకోవాలని ఐశ్వర్య పట్టుబట్టడంతో మార్చి 27న పెళ్లి చేసుకుంటానని రాంబాబు హామీ ఇచ్చాడు. అయితే ఆమెను ఎలాగైనా వదిలించుకోవాలనే ఉద్దేశంతో ఆ మరుచటి రోజు అద్దెకు ఉంటున్న ఇంటిలో ఐశ్వర్యను ఉరి చేసి, తర్వాత లైఫ్‌కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించడంతో స్నేహితుడి సహకారంతో బైక్‌పై మృతదేహాన్ని పెట్టి సాలూరు మండలం చీపురువలస వద్దకు తీసుకువచ్చి జీడితోటలో పడేశాడు. పోలీసులు మొదట్లో అనుమానాస్పద మృతి కేసుగా భావించినప్పటికీ, విచారణలో రాంబాబే హత్య చేసినట్లు తేలింది. ద్విచక్ర వాహనంపై మృతదేహాన్ని తీసుకురావడానికి సహకరించిన స్నేహితుడ్ని ఏ2గా... అదే వాహనానికి పెట్రోల్ పోసేందుకు సహకరించిన వ్యక్తిని ఏ3గా కేసు నమోదు చేశారు. నిందితుల నుంచి రెండు ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ రామకృష్ణ, పట్టణ సీఐ అప్పలనాయుడు పాచిపెంట, మక్కువ సాలూరు ఎస్సైలు పాల్గొన్నారు.

- మామిడి కాయలకు కవర్లతో రక్షణ
- తెగుళ్లు, మచ్చలకు చెక్
- జిల్లాలో 30 వేల హెక్టార్లలో మామిడి సాగు
- ఇప్పటివరకు 10 వేల కవర్లు అందించిన ఉద్యానశాఖ


మెరకముడిదాం మండలంలో మామిడి కాయలకు తొడిగిన కవర్లు

కవరులో మామిడి..
నాణ్యమైన దిగుబడి

విజయనగరం ఫోర్ట్: మామిడి పండు అంటే ఇష్టపడని వారు ఉండరు. పిల్లలు దగ్గర నుంచి పెద్ద వారు వరకు అందరూ మామిడి పండును ఎంతో ఇష్టంగా తింటారు. అయితే మామిడి పిందె దశలో ఉన్నప్పటి నుంచి జాగ్రత్తలు పాటించకపోతే దిగుబడి తగ్గడంతో పాటు పంట నాణ్యత కూడ దెబ్బతింటుంది. దీని వల్ల మామిడి రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన పంట రావడంతో పాటు ధర కూడా ఎక్కువగా రావడం కోసం మామిడి రైతులు వినూత్నమైన ఆలోచనలతో ముందుకు సాగుతున్నారు. మామిడిలో ఫ్రూటీ కవర్లు అనే కొత్త విధానాన్ని అవలంభిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో పలు ప్రాంతాల్లో ఫ్రూటీ కవర్ల విధానాన్ని వినియోగంలోకి తీసుకువచ్చారు.

పురుగు మందులు పిచికారి చేసినా..!

మామిడిలో పూత, పిందె నిలబడడంతో పాటు పురుగుల నివారణ కోసం మామిడి రైతులు రెండు, మూడు దఫాలు పురుగు మందులు పిచికారీ చేస్తూంటారు. దీని వల్ల రైతులకు అంతగా ప్రయోజనం ఉండదు. ఎన్ని సస్యరక్షణ చర్యలు చేపట్టినా మామిడికి మచ్చలు, పురుగులు ఆశిస్తూ ఉంటాయి. ముఖ్యంగా పండు ఈగ మామిడిని ఆశించి దెబ్బతీస్తుంది. ఈ సమయంలో నాణ్యమైన కాయల దిగుబడికి రైతులు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఫ్రూటీ కవర్లు తొడిగి అధిక లాభాలు ఆర్జిస్తున్నారు.


కవరు తొడిగిన తర్వాత వచ్చిన నాణ్యమైన మామిడి పండు

కవర్‌కు రుపాయి రాయితీ..

మామిడి కాయలకు తొడిగే కవర్‌కు ఉద్యానవన శాఖ 50 శాతం రాయితీ ఇస్తుంది. ఒక కవర్ రూ. 2 అయితే రైతు తన వాటా కింద రుపాయి భరించాలి. ప్రస్తుతం జిల్లాలో 30 వేల హెక్టార్లలో మామిడి సాగులో ఉంది. ఇప్పటివరకు ఉద్యానశాఖ సుమారు 10 వేల కవర్లు అందించింది. ఇదిలా ఉంటే మామిడి కాయలకు కవర్లు తొడిగే సమయంలో రైతులు వాటిపై తేదీలు రాసుకోవాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. మామిడికాయలు అన్ని ఒకే సమయంలో కోతకు రావు. అందుకే కాయలకు కవర్లు తొడిగినప్పుడే తేదీలు రాసుకోవడం వల్ల ఎప్పుడు ఏ కాయలు కోయాలో సులువుగా తెలుసుకోవచ్చు. పేపర్‌తో చేసిన కవర్లనే వాడాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ పాలిథిన్ కవర్లు వినియోగించకూడదు. పేపర్ కవర్లు వినియోగించడం వల్ల కాయకు గాలి, వెలుతురు తగలడం వల్ల నాణ్యంగా ఉంటుంది.

నాణ్యమైన దిగుబడి

> మామిడి కాయలకు కవర్లు తొడగడం వల్ల నాణ్యమైన దిగుబడి వస్తుంది. కవరు ఖరీదు రూ.2 కాగా ఉద్యానవన శాఖ రూపాయి భరిస్తుంది. మిగిలిన రూపాయి రైతు భరించాలి. ఇప్పటివరకు పది వేల కవర్లు అందించాం.
> – జమదగ్ని, డిప్యూటీ డైరెక్టర్, ఉద్యానశాఖ

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

కాయకు కవర్ తొడిగేటప్పుడు కవర్ అడుగుకు కాయ తగలకుండా కొంచెం ఖాళీ ఉండేలా చూసుకోవాలి. కాయ పెరుగుతున్నప్పుడు కవర్ పగిలి పోకుండా ఉంటుంది. వర్షం పడినప్పుడు, మంచు పడే సమయంలో కవర్లు తొడగకూడదు. ఎండ ఉన్న రోజు మాత్రమే కవర్లు వేయాలి.